ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 1 నవంబరు 2025

ఉక్కు మనిషి పటేల్

● కలెక్టర్ ఆనంద్ ● ఘనంగా 150వ జయంతి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉక్కు సంకల్పంతో భారతదేశాన్ని ఐక్యం చేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్‌కి దక్కిందని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. దేశ మొదటి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా కేంద్ర క్రీడా, యువజన వ్యవహారా ల శాఖ, మేరా యువభారత్ సంయుక్త ఆధ్వర్యంలో ఐక్యతా మార్చ్‌ను శుక్రవారం నిర్వహించారు. తొలుత ఆర్ట్స్ కళాశాల మైదానంలో పటేల్ చిత్రపటానికి కలెక్టర్ ఆనంద్ పుష్పాంజలి ఘటించారు. అనంతరం జెండా ఊపి ఐక్యతార్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ క్లాక్‌టవర్, సుభాష్‌రోడ్డు, సప్తగిరి సర్కిల్, అంబేడ్కర్ విగ్రహం, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, కోర్టురోడ్డు మీదుగా ఎన్టీఆర్ విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన పటేల్ తొలి ఉపప్రధానిగా దేశ ఐక్యత, సమగ్రతకు పాటు పడ్డారని కొనియాడారు. 565 స్వదేశీ సంస్థానాలను ఉక్కు సంకల్పంతో దేశంలో విలీనం చేసిన ఘనత పటేల్‌కే దక్కిందన్నారు. యువత పటేల్ అడుగుజాడల్లో పయనించి వికసిత్‌భారత్, ఆత్మనిర్భర్ భారత్ కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మై భారత్ జిల్లా ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మశ్రీ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, సెల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి, మైభారత్ జిల్లా కమిటీ సభ్యులు అశోక్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మైదుకూరు ఆంజినేయులు, ఉపాధ్యక్షులు బోనాల మారుతి, గోవింద ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




సర్దార్‌వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పిస్తున్న కలెక్టర్, బీజేపీ నాయకులు, జెండా ఊపి ఐక్యతా ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆనంద్



ఇంటి వద్దకు ముఖ్యమంత్రి

నేడు పెద్దన్నవారిపల్లికి చంద్రబాబు

● ముగ్గురికి ఇళ్ల వద్ద పింఛన్ పంపిణీ
● సమస్యలు తెలుసుకునేందుకు ప్రజా దర్బార్
● తెలుగుదేశం శ్రేణులతో ప్రత్యేక సమావేశం
● ఏర్పాట్లను పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం



కదిరి, పుట్టపర్తి టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తలుపుల మండలం పెద్దన్నవారిపల్లికి శనివారం వస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ, ప్రజా దర్బార్, పార్టీ శ్రేణులతో జరిగే సమావేశాలలో ఆయన పాల్గొంటారు. గ్రామంలో 756 మందికి వివిధ రకాల పింఛన్లు అందుతున్నాయి. వీరిలో చింతలయ్య, రెడ్డెమ్మ, మేడా మల్లయ్య ఇళ్లకు వెళ్లి పింఛన్‌లను అందజేస్తారు. వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకుంటారు. ముఖ్యమంత్రి స్వయంగా తమ ఇళ్లకు వస్తున్నారని తెలుసుకుని వారు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. ఆ క్షణాల కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నామని అన్నారు. తమకు ప్రభుత్వ పథకాలు అన్నీ అందుతున్నాయని, పక్కా ఇంటిని నిర్మించి ఇవ్వాలని కోరుతామని చింతలయ్య, రెడ్డెమ్మ అన్నారు. హంద్రీనీవా నీటి రాకతో తమ ప్రాంత రైతులు సంతోషంగా ఉన్నారని మేడా పుల్లయ్య అన్నారు.

నిరాడంబరం.. కట్టుదిట్టం

చంద్రబాబు పర్యటన నిరాడంబరంగా జరిగేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పరిశీలించారు. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, జేసీ మౌర్య భరద్వాజ్, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్, ప్రజా దర్బార్ వేదికను పరిశీలించారు. వీఐపీలు, గ్రామస్థులు, మీడియాకు ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేయించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని

(మిగతా 6వ పేజీలో...)



'సర్దార్' పోరాటం స్ఫూర్తిదాయకం: ఎస్పీ



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ జగదీష్



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ, సిబ్బంది

● ఉత్సాహంగా రన్ ఫర్ యూనిటీ

అనంతపురం క్రైం, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): సువిశాల భారతదేశం ఏకతాటిపైకి రావడానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన పోరాటం, కృషి ప్రశంసనీయమని, స్ఫూర్తిదాయకమని ఎస్పీ జగదీష్ కొనియాడారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని అమర వీరుల స్తూపం వద్ద జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి ఎస్పీ జగదీష్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసు అమరవీరుల వారోత్సవాలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అక్టోబరు 21 నుంచి 10 రోజుల పాటు అమరవీరులను స్మరించుకుంటూ అనేక కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఆఖరి రోజు జాతీయ ఐక్యత దినోత్సవం రోజున పటేల్ సేవలు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన దేశ రక్షణ, సమగ్రత కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. తర్వాత రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుంచీ గిల్డాఫ్ సర్వీసు రోడ్డు, సుభాష్ రోడ్డు మీదుగా క్లాక్‌టవర్, కోర్టు రోడ్డు, పోలీస్ పరేడ్ గ్రౌండ్ మీదుగా అమరవీరుల స్థూపం వరకూ సాగింది.

విజేతలకు బహుమతులు

అమరవీరుల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఎస్పీ బహుమతులు అందజేశారు. పోలీసు అధికారులు, సిబ్బందికి పెట్టిన వ్యాసరచన పోటీల్లో ప్రొబేషనరీ ఎస్ఐ గౌతమ్, కానిస్టేబుల్ షేకున్‌బీ, కానిస్టేబుల్ వనజ, వక్తృత్వం పోటీల్లో ఆర్ఎస్ఐ బాబ్జాన్, ఆర్ఎస్ఐ జాఫర్, కానిస్టేబుల్ ఈశ్వర్, పోలీస్ పిల్లల విభాగం వ్యాసరచన పోటీల్లో షేక్ జైనమాలిక్, షమ, రేఖ ప్రవల్లిక, వృక్తృత్వపు పోటీల్లో విజయభాస్కర్, సైఫాశమ్రిన్, మోక్షితారెడ్డి, పాఠశాల, కళాశాలల పిల్లల విభాగం వ్యాసరచన పోటీల్లో సూర్యనారాయణరెడ్డి, సదాఫ్ నాజ్, మహాలక్ష్మి, వ్యక్తృత్వపు పోటీల్లో యశస్విని, అలేఖ్య, ప్రియాంక విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, సీఐలు ధరణికిషోర్, క్రాంతికుమార్, శేఖర్, వెంకటేశ్వర్లు, రాజేంద్రనాథ్ యాదవ్, శ్రీకాంత్, జగదీష్, దేవానంద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, ఇతర సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి విద్యార్థులు



విద్యార్థిని అలేఖ్యతో తపోవనం జడ్పీ హైస్కూల్ టీచర్లు

అనంతపురం విద్య, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో రాజ్యాంగ దినోత్సవం రోజు జరిగే మాక్ అసెంబ్లీకి జిల్లా నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, ఒక్కో నియోజకవర్గం నుంచి ఒక విద్యార్థిని మాక్ అసెంబ్లీకి ఎంపిక చేశారు. ఈ నెల 26న అమరావతిలోని అసెంబ్లీలో విద్యార్థుల చేత మాక్ అసెంబ్లీ నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థుల్లో అలేఖ్య (అనంతపురం అర్బన్, తపోవనం జడ్పీ హైస్కూల్), వీభ కర్వ (గుంతకల్లు, రైల్వేస్కూల్), తలారి అభిజ్ఞ (కళ్యాణదుర్గం జడ్పీహెచ్ఎస్), శ్రీనాథ్ రెడ్డి(రాప్తాడు, ఏపీ మోడల్‌స్కూల్), గొల్ల హేమలత(రాయదుర్గం, యర్రగుంట జడ్పీహైస్కూల్), దీక్షిత(సోదనపల్లి జడ్పీ హైస్కూల్, శింగనమల), నాగమల్లికార్జున (ఎస్‌పీఎంహెచ్ఎస్, తాడిపత్రి), లహరి (కాలువపల్లి జడ్పీహైస్కూల్, ఉరవకొండ) ఉన్నారని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురిని ఎంపిక చేసి పంపాలని శుక్రవారం ఆదేశాలు వచ్చాయి. దీంతో పోటీలలో ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థుల వివరాలను రాష్ట్రశాఖకు పంపుతున్నారు.

పాతికేళ్లకు ప్లాన్

● ఉరవకొండలో నీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యం ● మంత్రి కేశవ్
● కొనసాగిన ఇంటింటికీ మంత్రి కార్యక్రమం

ఉరవకొండ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మరో పాతికేళ్లు ఉరవకొండలో తాగునీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యమని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన ఇంటింటికీ మంత్రి కార్యక్రమాన్ని రెండో రోజు కూడా నిర్వహించారు. ఇందిరానగర్, అంబేడ్కర్ నగర్‌లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందిరానగర్‌లో మగ్గాల గుంతల్లోకి నీరు చేరి, నష్టపోయామని కార్మికులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి చేనేత జౌళిశాఖ ఏడీతో ఫోన్‌లో మాట్లాడారు. వర్షం వల్ల మగ్గాలు నేసేవారు నష్టపోయిన వివరాల నివేదికను కలెక్టర్‌కు పంపి, పరిహారం వచ్చేలా చూడాలని ఆదేశించారు. పట్టణంలో డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని పలువురు మహిళలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఉరవకొండ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ప్రాధాన్యత క్రమంలో ఇప్పటికే తాగు నీటి ప్రాజెక్టును పూర్తి చేసి, నీటి సమస్య లేకుండా చేశామన్నారు.



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి

అర్హులందరికీ ఇళ్లపట్టాలు మంజూరు చేస్తామన్నారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్, ఏడాదికి రూ.25వేల సాయం అమలుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మహబూబ్‌బాషా, ఎంపీడీవో రవిప్రసాద్, మాజీ ఎంపీపీ కుళ్లాయప్ప, టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, విజయ్‌భాస్కర్, రామాంజినేయులు, తిమ్మప్ప, ప్యారం కేశవానంద, రహంతుల్లా, అల్లాబకాష్, వరప్రసాద్, రామాంజనేయులు పాల్గొన్నారు.

పాపంపేట బాధితుల కోసం ఎందాకైనా ..!

● సీపీఐ పోరాట బహిరంగ సభలో రామకృష్ణ



సభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పాపంపేట భూ బాధితులకు న్యాయం చేయడం కోసం ఎందాకైనా వెళ్తామని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మండలంలోని పాపంపేటలోని జొన్న ఐరన్ మార్ట్ సమీపంలో శుక్రవారం సాయంత్రం పాపంపేట భూ బాధితులకు అండగా సీపీఐ పోరాట శంఖారావం బహిరంగ సభ నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రామకృష్ణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, కార్యవర్గ సభ్యులు జాఫర్ తదితరులు హాజరయ్యారు. రామకృష్ణ మాట్లాడుతూ పాపంపేట భూముల జోలికొస్తే తన్ని తరిమికొట్టాలని స్థానికులకు పిలుపునిచ్చారు. తాము అండగా ఉంటామన్నారు. ఇప్పటి వరకు ఎమ్మెల్యే పరిటాల సునీత గురించి తాను ఎక్కడా మాట్లాడింది లేదన్నారు. 'నీకు సోదరుడిగా చెబుతున్నా. నీ చుట్టూ పిశాచాలు, దెయ్యాలు చేరాయి. నిన్ను ముంచుతాయ్' అంటూ పరిటాల సునీతను హెచ్చరించారు. మంది సొమ్మును ఆశించొద్దంటూ హితవు పలికారు. పదిహేను రోజుల్లో బాధితులకు న్యాయం జరిగేలా స్పష్టత ఇవ్వాలన్నారు. మండల సర్వేయర్, వీఆర్వో ఇచ్చిన పత్రాలను పట్టుకుని కబ్జాదారులు కోర్టుకెళ్లారు. దొంగ పత్రాలు ఇస్తుంటే కలెక్టర్, తహసీల్దార్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆ అధికారులను ఉద్యోగం నుంచి తొలగించాలన్నారు. లేనిపక్షంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లికార్జున, రాజారెడ్డి, శ్రీరాములు, కేశవరెడ్డి, పద్మావతి, రమేష్, టినారాయణస్వామి, నరేష్, రమణయ్య, దుర్గాప్రసాద్, పాపంపేట పరిరక్షణసమితి సభ్యులు పాల్గొన్నారు.

ఊసులాడి.. ఊడ్చేస్తారు..!



● సోషల్ మీడియాలో కిలేడీ వెబ్‌సైట్ లింకులు
● ఓపెన్ చేస్తే అమ్మాయిల గొంతుకతో కాల్స్



స్నేహం.. ప్రేమ.. పెళ్లి.. పేరిట బురిడీ

హిందూపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికపై వలపు వలలో పడి యువకులు, పెళ్లైనవారు విలవిలలాడుతున్నారు. స్నేహం, జోడీ పేరిట కనిపించే వెబ్‌సైట్ లింకులను క్లిక్ చేసి.. బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసుకుంటున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్.. ఇలా ఏదో ఒక మార్గంలో అమ్మాయిల గొంతుతో కేటుగాళ్లు వాయిస్ కాల్స్ చేసి బురిడీ కొట్టిస్తున్నారు. మరికొన్ని సందర్భాల్లో అమ్మాయిలే ఇలా మోసగిస్తున్నారు. 'కలుసుకుందాం.. పెళ్లి చేసుకుందాం.. మాట్లాడుకుందాం..' అని లైన్‌లో పెట్టి, మాయ చేసి డబ్బులు కాజేస్తున్నారు. అటువైపు నుంచి వినిపించేది అమ్మాయిల గొంతే అయినా, మాట్లాడుతోందని అమ్మాయే అన్న గ్యారెంటీ లేదు. అయినా పెళ్లికాని యువకులు, పెళ్లి అయిన పురుషులు కూడా ఉచ్చులో పడిపోతున్నారు. సరదాగా వెబ్‌సైట్‌లు తెరిచి.. బుట్టలో పడిపోతున్నారు. గుట్టుగా మాట్లాడుకుంటున్నారు. అటువైపు ఉన్నది అపరిచితులే అయినా.. అడిగిన వెంటనే వేలు.. లక్షలు ఇచ్చేస్తున్నారు. మోసపోయామని తెలుసుకున్నా.. పోలీసులను ఆశ్రయించడం లేదు. అవమానంగా భావించి, స్నేహితులు, కుటుంబ సభ్యులకు కూడా చెప్పుకోవడం లేదు. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. నిత్యం వందలాది మందిచిన దోచుకుంటున్నారు. అతి చనువు వెనుక దాగిన అపాయాన్ని పసిగట్టుకుంటే ప్రమాదం తప్పదని పోలీసులు తరచూ హెచ్చరిస్తున్నా చైతన్యం రావడం లేదు.

ఊసులు ఆగిపోయి..

ప్రేమ, పెళ్లి, సహజీవనం పేరుతో విసిరే వలపు వలల వెనుక అమ్మాయిలే ఉన్నారో, కేటుగాళ్లు ఉన్నారో తెలియదు. మాట్లాడుతోంది మనిషో, ఏఐ బొమ్మనో తెలియదు. మంత్రాల్లాంటి మాటలు

(మిగతా 6వ పేజీలో..)

వైసీపీవి అబద్ధాల తుఫాన్లు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం క్రైం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అబద్ధాల తుఫాన్లు సృష్టించడానికి వైసీపీ కుట్రలు చేస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ మండిపడ్డారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గంజే నాగరాజు, కురుబ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కురుబ నారాయణస్వామి యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిర్వహించారు. తీవ్ర తుఫాను వల్ల రైతులు, ప్రజలు నష్టపోయి ఇబ్బందులు పడుతుంటే వారికి సాయం చేయాల్సింది పోయి జగన్ బ్యాచ్ అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటల బీమాపై వైసీపీ నేతలు నిస్సిగ్గుగా ఆందోళనలు చేయడం గర్హనీయమన్నారు. పీఎం ఫసల్ బీమా యోజన కింద గత ఖరీఫ్‌లో రూ. 58.83 కోట్లు మంజూరైంది వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. వైసీపీ పాలనలో ధాన్యం కొనుగోలు ఒక ప్రహసనంగా మారిందని, 75 కిలోల బస్తాకు రూ.100 నుంచి రూ.200 వరకూ అదనంగా వసూలు చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ అవుతోందన్నారు. జగన్ ప్రభుత్వంలో డ్రిప్ సబ్సిడీ, సాగునీటి ప్రాజెక్టులను గాలికి వదిలేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో హంద్రీనీవా విస్తరణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేక వైసీపీ బ్యాచ్ డైవర్షన్ రాజకీయాలు చేస్తూ...ఫేక్ ప్రచారం చేస్తోందని ఆయన మండిపడ్డారు.

నేడు పింఛన్‌ల పంపిణీ

అనంతపురం అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవంబరు నెల పింఛన్ల సొమ్మును శనివారం ఉదయం నుంచి సచివాలయ సిబ్బంది పంపిణీ చేయనున్నారు. మొత్తం 2,81,483 మందికి రూ.125.32 కోట్ల పింఛన్ సొమ్ము మంజూరైంది. పింఛన్ సొమ్ము కోసం సచివాలయాలు, ఇతర కార్యాలయల వద్దకు లబ్ధిదారులు వెళ్ల వద్దని, ఇళ్ల వద్దకే సిబ్బంది వచ్చి సొమ్ము అందజేస్తారని డీఆర్‌డీఏ పీడీ శైలజ తెలిపారు. 2వ తేదీ ఆదివారం సెలవు రోజు కావడంతో తొలి రోజు పింఛన్ తీసుకోనివారికి స్థానిక సచివాలయంలో 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందజేస్తామని తెలిపారు.

రెవెన్యూ క్రీడలను విజయవంతం చేయండి

● కలెక్టర్ ఆనంద్ (6లో...)

భాషపై పట్టు సాధించండి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు సూచన ● విజయనగర లా కళాశాలలో గేట్ వే సెలబ్రేషన్స్ న్యూవేవ్

(7లో...)

బాల్య వివాహాలు జరిగితే కఠిన చర్యలు

● కలెక్టర్ (7లో...)

చురుగ్గా లీజు ప్రాంతాల హద్దుల గుర్తింపు

(7లో...)





ర్యాలీగా వస్తున్న పోలీసు అధికారులు



కొవ్వొత్తులు వెలిగిస్తున్న విద్యార్థులు

జోహారులు.. జోహారులు..!

పోలీసు అమరవీరులకు నివాళులు అర్పిస్తూ పోలీసు శాక నగరంలో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించింది. విధి నిర్వహణలో అసువులు బాసిన వీరులను స్మరించుకుంటూ క్లాక్ టవర్ నుంచి సుభాష్ రోడ్డు, గిల్డ్ అఫ్ సర్వీస్ స్కూల్ మీదుగా జిల్లా పోలీస్ కార్యాలయం వరకూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించారు. వందలాది మంది పోలీసులు, నగర ప్రముఖులు, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

- అనంతపురం క్రైం, ఆంధ్రజ్యోతి

సమైక్య భారత నిర్మాణానికి బీజేపీ కృషి

● జాతీయ ఐక్యతా ర్యాలీలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, విద్యార్థులు

ధర్మవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సమైక్య భారత నిర్మాణానికి బీజేపీ కృషిచేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు శుక్రవారం ధర్మవరంలో జాతీయ ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. గాంధీ నగర్ మారుతీ రాఘవేంద్రస్వామి కల్యాణ మండపం నుంచి కాలేజ్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. కళాశాల, పాఠశాలల విద్యార్థులు, వ్యాపార వేత్తలు, పురప్రముఖులు, సామాజిక సేవకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సందిరెడ్డి మాట్లాడుతూ... వల్లభాయ్ పటేల్ దేశసమైక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. అనంతరం పోతుకుంటలో ఉన్న పటేల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ అమర దేవేంద్ర, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబుళేశు, పట్టణ, రూరల్ అధ్యక్షులు జింకా చంద్ర, గొట్లూరు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌లో ఇరుక్కున్న 108



ట్రాఫిక్‌లో ఇరుక్కుయిన 108 అంబులెన్స్

ధర్మవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం 108 అంబులెన్స్ ట్రాఫిక్ మధ్యలో అరగంటకుపైగా ఇరుక్కుపోయింది. సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు కాలేజ్ సర్కిల్‌లో సమావేశం నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ ట్రాఫిక్‌లో 108 అంబులెన్స్ ఇరుక్కుపోయింది. ఎంత సేపు సైరన్ కొట్టినా ఎవరూ దారివ్వలేదు. ఇది చూసిన ప్రజలు కనీసం అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా రోడ్డుపై కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఏమిటని చర్చించుకున్నారు. సమావేశమయ్యాక అంబులెన్స్‌కు దారి వదిలారు.

ఉద్యాన పథకాల ప్రయోజనం పొందండి

● మంత్రి సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ఉద్యాన శాఖ పథకాల నుంచి నియోజకవర్గ రైతులు పూర్తి స్థాయిలో ప్రయోజనం పొందాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చి, రైతుల ఆదాయం పెంచడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఇందు కోసం ఫాం పాండ్లు, ప్యాక్ హౌస్ పథకాలకు నవంబరు 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి రైతు స్థానిక రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫాం పాండ్ల పథకం కింద ప్రభుత్వం రైతులకు 50 నుంచి 75 శాతం వరకు సబ్సిడీ అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ప్రకటనలో కోరారు.

రైల్వే ట్రాక్‌మన్ బలవన్మరణం



అనిల్‌కుమార్ నాయక్(ఫైల్)

కొత్తచెరువు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రశాంతి రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటున్న అనిల్‌కుమార్‌నాయక్(38) అనే రైల్వే ట్రాక్‌మన్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లి తండాకు చెందిన అనిల్‌కుమార్ నాయక్ స్థానికంగా రైల్వే ట్రాక్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతడు గురువారం భార్య అనితాబాయితో కలిసి స్వగ్రామానికి వెళ్లాడు. అయితే విధి నిర్వహణలో భాగంగా గురువారం రాత్రి రైల్వే క్వార్టర్స్‌లోని ఇంటికి వచ్చాడు. తోటి ఉద్యోగి శుక్రవారం ఉదయం అనిల్‌కుమార్‌నాయక్ ఇంటి వద్దకు వెళ్లి పిలిచినా ఎంత సేపటికి పలుక లేదు. దీంతో కిటికీలో నుంచి చూడగా ఉరికివేలాడుతూ కనిపించాడు. దీంతో కొత్తచెరువు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనికుమార్ నాయక్ గతంలో ప్రమాదానికి గురికా వడంతో కాలికి రాడ్లు వేశారు. అవి నొప్పిగా ఉండటంతో తరచూ బాధపడుతుండేవాడు. కాలి నొప్పి భరించలేక శుక్రవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య అనితా బాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు సాత్విక్ అనే కుమారుడు ఉన్నాడు.

రేషన్ కార్డు ఉంటే ఉచిత వైద్యం

ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి అసోసియేట్ డైరెక్టర్ రాజశేఖర్



మాట్లాడుతున్న రాజశేఖర్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి

మడకశిర రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు ఉన్న పేదలకు ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్లు నిర్వహిస్తామని ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి అసోసియేట్ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో దివంగత శ్రీరామరెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో నిర్మించిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని శుక్రవారం ఆయన మాజీమంత్రి రఘువీరారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.ఆరు కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆసుపత్రిని మూడో తేదీ ప్రారంభిస్తామన్నారు. ఆంధ్ర, తెలంగాణ, ఒడిసా 24 ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. నీలకంఠాపుం గ్రామంలో 25 వది ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అన్నీ రకాల కంటి పరీక్షలు, ఆపరేషన్లు నీలకంఠాపురంలోనే నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కేటీ శ్రీధర్ స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా చెస్ క్రీడాకారుడికి అంతర్జాతీయ పతకం



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో జిల్లా చెస్ క్రీడాకారుడికి రజత పతకం దక్కింది. మంగోలియా దేశంలో నిర్వహించిన 19వ ఏషియన్ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో భారత్ తరఫున జిల్లా క్రీడాకారుడు శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ పాల్గొన్నాడు. ఈ పోటీల్ల అత్యంత ప్రతిభ కనబరిచిన శామ్యూల్ స్టీఫెన్ నోబుల్‌కు ద్వితీయ స్థానం దక్కింది. రజత పతకం సాధించిన క్రీడాకారుడిని పలువురు అభినందించారు.

ఊసులాడి.. ఊడ్చేస్తారు..!



(5వ పేజీ తరువాయి)

వినిపించగానే ఇక అమ్మాయి దొరికేసింది అన్నట్లు బుట్టలో పడిపోతున్నారు. డబ్బులు కాజేసిన తరువాత అక్కడి నుంచి ఊసులు ఆగిపోగానే అవమాన భారంతో కుమిలిపోతున్నారు. స్నేహం పేరిట మొదలు పెట్టి మాటల్లో ఎక్కడెక్కడికో తీసుకుపోతున్నా అనుమానించడం లేదు. దీనికి కారణం.. సోషల్ మీడియాలో అందమైన యువతుల ఫొటోలతో కేటుగాళ్లు ఖాతాలను నిర్వహించడమే. హిందూపురం ప్రాంతానికి చెందిన ఓ మహిళ కొన్నాళ్లపాటు ఇదే ప్రాంతానికి చెందిన కొందరికి ఫోన్ కాల్స్ చేసి.. ట్రాప్‌లో పెట్టి దోచేసింది. చివరకు కటకటాలపాలైంది.

చుక్కలు చూపిస్తారు

ట్రాప్‌లో పడినవారికి సైబర్ నేరగాళ్లు చుక్కలు చూపుతున్నారు. ఏకాంతంగా కలుద్దామని పిలవడం, అక్కడికి వెళ్లగానే తమ కుటుంబ సభ్యులకు అరోగ్యం బాగా లేదనో, ప్రమాదం జరిగిందనో మాయ మాటలు చెప్పడం పరిపాటిగా మారుతోంది. ఆ మాటలను నమ్మగానే వైద్యం పేరిట డబ్బులు గుంజుతున్నారు. మరికొందరు నగ్నంగా మార్ఫి వీడియో కాల్స్ ద్వారా రికార్డు చేసి బెదిరింపులకు దిగుతున్నారు. ఆ వీడియోలను బయట పెడతామని బెదిరించి డబ్బులు గుంజుతున్నారు. అందుకే సోషల్ మీడియా ఖాతాలు, అపరిచితుల కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

పెళ్లి చేసుకుందాం..



సోమందేపల్లికి చెందిన ఓ చేనేత కార్మికుడు వారం క్రితం ఫేస్‌బుక్ చూస్తుండగా ఓ వెబ్‌సైట్ దర్శనమిచ్చింది. దాన్ని ఓపెన్ చేయగానే ఓ యువతి ఫోన్‌చేసి పలకరించింది. మాటలు కలిపింది. 'నాకు పెళ్లి కాలేదు. చేనేత కార్మికులు అంటే నాకు చాలా ఇష్టం. ఓ చేనేత కార్మికుడిని పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నా..' అంది. ఇదంతా నిజమేనని ఆ చేనేత కార్మికుడు అనుకున్నాడు. 'మీరూ చేనేత కార్మికుడే కదా..? ఓకే అంటే త్వరలోనే మనమిద్దరం పెళ్లి చేసుకుందాం..' అని నమ్మించింది. అలా లైన్‌లో పెట్టి.. ఖర్చుల పేరిట రూ.లక్ష దాకా లాగేసుకుంది. 'ఇంక పెళ్లి చేసుకుందాం రా..' అని కార్మికుడు ఆహ్వానించగానే.. 'వచ్చేస్తున్నా..' అని ఓ తేదీ చెప్పింది. ఆ రోజు నుంచి ఫోన్ కాల్స్ ఆగిపోయాయి. ఆ యువతి వాట్సప్ వాయిస్ కాల్స్ కాకుండా, ఇన్‌స్టా వాయిస్ కాల్స్ చేసి బురిడీ కొట్టించింది.

కలుసుకుందాం రా..!

హిందూపురం పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ కంపెనీ ఉద్యోగికి సోషల్ మీడియాలో ఓ వెబ్‌సైట్ లింక్ కనిపించింది. దాన్ని క్లిక్ చేసిన కాసేపటికి ఓ యువతి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ఆమె సూచనతో రూ.1500 చెల్లించి ఆ వెబ్‌సైట్‌లో సభ్యుడిగా చేరాడు. అక్కడ సరైన జోడీ కోసం వెతుకుతుండగా మరో యువతి ఫోన్‌చేసి పలకరించింది. ఇద్దరి మధ్య కొన్నాళ్లు చాటింగ్, వాట్సప్, ఫోన్‌కాల్స్ కొనసాగాయి. అలా ఫోన్‌లో దగ్గరయ్యారు. 'మనం కలుసుకుందాం. ఎక్కడైనా రూమ్ బుక్ చెయ్' అని ఆమె ఊరించింది. ఆ యువకుడు మొహమాటానికి పోయాడు. 'వద్దులే..' అన్నాడు. దీంతో ఆమెనే చొరవ తీసుకుంది. 'బెంగళూరులో ఓ హోటల్ గది బుక్ చేస్తున్నా.. రూ.10 వేలు' అంది. మనోడు అలా వలలో పడిపోయాడు. ఆమె బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు జమ చేశాడు. బెంగళూరుకు చేరుకుని, ఆమె బుక్ చేసినట్లు చెప్పిన హోటల్ వద్దకు వెళ్లాడు. అక్కడ ఆమె కనిపించలేదు. ఫోన్ చేస్తే.. 'అక్కడ వద్దు.. ఇంకో చోటకు రా..' అని పిలిచింది. అప్పటికే సమయం ముగియడంతో 'నాకు వేరే పని ఉంది. ఇంకోసారి కలుద్దాం..' అని చెప్పి తిరుగు ముఖం పట్టాడు. ఆ తరువాత కూడా ఫోన్ సంభాషణలు కొనసాగాయి. ఊరించి.. ఊరించి.. రూ.2 లక్షల దాకా కాజేసింది ఆమె. చివరకు మోసపోయానని అర్థమైంది. బయటకు చెబితే చులకన అవుతానని మౌనంగా ఉండిపోయాడు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది.

సమాచారం ఇవ్వండి..



అందమైన అమ్మాయిల ఫొటోలు పంపినా, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు పంపి డబ్బు డిమాండ్ చేసినా భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతాం. సోషల్ మీడియాలో పెట్టే అందమైన అమ్మాయిల ఫొటోలను చూసి మోసపోకూడదు. ఇలాంటి మోసాలు తరచూ జరుగుతున్నా ప్రజలు మేల్కోకపోవడం బాధాకరం.

- మహేష్, డీఎస్పీ, హిందూపురం

ఇంటి వద్దకు ముఖ్యమంత్రి

(5వ పేజీ తరువాయి)

అధికారులను కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు.

ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

- ఉదయం 11 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.
- 11:30 గంటలకు పెద్దన్నవారిపల్లి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11:40 గంటల వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు స్వాగతం పలుకుతారు.
- 11:45 గంటలకు హెలిప్యాడ్ నుంచి గ్రామంలోకి చేరుకుంటారు.
- 12:15 గంటల వరకు గ్రామంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ అందజేస్తారు.
- 12:20 గంటలకి గ్రామ సమీపంలోని ప్రజావేదిక వద్దకు వెళతారు
- 01:50 గంటల వరకు ప్రజావేదికలో పాల్గొంటారు.
- ఆ తరువాత 2:30 గంటల వరకు విరామం
- 2:35 గంటలకు పెద్దన్నవారిపల్లికి సమీపంలో ఏర్పాటు చేసిన పార్టీ శ్రేణుల సమావేశ వేదిక వద్దకు చేరుకుంటారు.
- సాయంత్రం 4 గంటల వరకు శ్రేణుల సమావేశంలో పాల్గొంటారు.
- ఆ తరువాత హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణమౌతారు.

నేడు పింఛన్ల పంపిణీ

జిల్లాలో శనివారం 2,64,802 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. వీరందరికీ రూ.115.92 కోట్లు పంపిణీ చేస్తారు. పింఛన్ సొమ్మును శనివారం తీసుకోని వారికి సోమవారం అందజేస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

నాకు ఇల్లు కావాలి..



నాకు పింఛన్ వస్తోంది. నెల నెల రూ.4 వేలు అందుతోంది. ఈ నెల స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే మా ఇంటికి పింఛన్ అందివ్వడానికి వస్తున్నారు. ఎంతో ఆనందంగా ఉంది. నేను ఒక్కడినే ఉంటాను. నా ఇల్లు కూలిపోయే స్థితిలో ఉంది. ఎప్పుడు పడిపోతుందో అనే భయం వెంటాడుతోంది. ముఖ్యమంత్రి మా ఇంటికి వచ్చినప్పుడు ఇల్లు కావాలని అడుగుతాను.

- చింతలయ్య, పెద్దన్నవారిపల్లి

సంతోషంగా ఉంది..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మా ఇంటికి వచ్చి స్వయంగా పింఛన్ ఇస్తారని అధికారులుచెప్పారు. ఎంతో ఆనందంగా ఉంది. ప్రభుత్వ పథకాలు అన్నీ అందుతున్నాయి. గతంలో పింఛన్ రూ.3 వేలు వచ్చేది. ఇప్పుడు రూ.4 వేలు వస్తోంది. ఒకటో తేదీనే పింఛన్ ఇస్తున్నారు. రేషన్ బియ్యం అందుతున్నాయి. మా ప్రాంతానికి హంద్రీనీవా నీళ్ళు రావడంతో రైతులు ఆనందంగా ఉన్నారు.

- మేడా మల్లయ్య, పెద్దన్నవారిపల్లి



అన్ని పథకాలూ అందుతున్నాయి..



నాకు భర్త లేదు. నెలనెలా పింఛన్ వస్తోంది. మూడు గ్యాస్ సిలెండర్‌లు ఉచితంగా అందుకున్నాను. టీ హోటల్ నడుపుకుంటున్నాను. సరుకుల కోసం కదిరి, తలుపులకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో వెళ్ళి వస్తున్నాను. అన్ని పథకాలు అందుతున్నాయి. కానీ ఉండటానికి సరైన ఇల్లు లేదు. ముఖ్యమంత్రి మా ఇంటికి వచ్చినప్పుడు ఇల్లు కావాలని అడుగుతాను. ఆయన రాక కోసం ఎదురుచూస్తున్నాను.

- రెడ్డెమ్మ, పెద్దన్నవారిపల్లి

జిల్లా చెస్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన చెస్ క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా చెస్ బాల, బాలికల క్రీడాకారులను ఎంపిక చేశారు. స్థానిక న్యూటౌన్ బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల, బాలికల చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. బాలుర విభాగంలో అచ్యుతరామరాజు, శర్వాన్‌తేజ్, ఎస్ కృష్ణసురేంద్ర, వినీత్, శ్రీధర్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో అనన్య, శ్రీహా, లాలిత్య, సుశాన్‌క్లారా, లక్ష్మీప్రణతి ఎంపికయ్యారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్, హుస్సేన్‌ఖాన్, మల్లికార్జున, పీడీలు రామకృష్ణ, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గిరిజన స్వాభిమాన ఉత్సవాలు

అనంతపురం విద్య, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు పక్షంరోజులు పాటు జిల్లాలో గిరిజన స్వాభిమాన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆశాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి ఈనెల15వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. జిల్లాకేంద్రంలోని నవోదయకాలనీలో ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో శనివారం ఈస్వాభిమాన ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు.

ఓసీలను విస్మరిస్తే పన్నులు చెల్లించం

● ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

అనంతపురం అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఓసీలను విస్మరిస్తే ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా సహాయనిరాకరణ చేస్తామని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక లలితకళాపరిషత్‌లో జిల్లా విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఓసీ విద్యార్థి యువ గర్జన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అత్యధిక శాతం పన్నులు రూపంలో చెల్లించేది ఓసీ వర్గాలకు చెందిన వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలేనన్నారు. అయినా నిరుపేద ఓసీల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం శోచనీయమన్నారు. జాతీయ స్థాయిలో ఓసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.లక్ష కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అగ్రవర్ణ పేదలకు మేజర్ జనరల్ సిన్హా నివేదిక మేరకు ఇతర వర్గాలతో సమానంగా ప్రభుత్వ పథకాలు అమలు చేయాలన్నారు. ఓసీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ టెట్‌లో అర్హత మార్కులను ఓసీలకు 90 నుంచి 75కి తగ్గించాలన్నారు. పోటీ పరీక్షలకు వయోపరిమితిని సడలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంజునాథ్ చౌదరి, జిల్లా అధ్యక్షుడు రాము, కార్యదర్శి మాధవరెడ్డి, రాయలసీమ బలిజ సంఘం సహాయ కార్యదర్శి సూరి, ఓసీ ఎలక్ట్రిసిటీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీధర్, ఆర్యవైశ్య ట్రస్టు అధ్యక్షుడు రమేష్‌బాబు, నాయకులు సత్యనారాయణ శర్మ, రెడ్డి జేఏసీ నాయకులు శేషాద్రిరెడ్డి, సురేష్‌రెడ్డి, హనుమంతరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ క్రీడలను విజయవంతం చేయండి

● కలెక్టర్ ఆనంద్



బెలూన్ ఎగురవేస్తున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఏడో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. నగరంలోని కృష్ణ కళామందిర్‌లో శుక్రవారం నిర్వహించిన ఏడో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు-2025కు సంబంధించిన బెలూన్ ఎగురవేసే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగే రెవెన్యూ క్రీడలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దివాకర్‌బాబు, సెక్రటరీ సోమశేఖర్, తహసీల్దార్ మోహన్‌కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీ సంజీవరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, రెవెన్యూ క్రెడిట్ సొసైటీ ట్రెజరర్ సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కలశ స్థాపన

● పులకించిన నెట్టికంటి అంజన్న భక్తులు ● హాజరైన ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు



అలంకారాలలో స్వామివారు.. తూర్పు గోపుర కలశ స్థాపనలో ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, కాలవ శ్రీనివాసులు



గుంతకల్లు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కసాపురంలో నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయ రాజగోపురాల కలశ స్థాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని అన్ని గోపురాలపై శుక్రవారం ఉదయం 11 గంటలా 11 నిమిషాలకు ఏకకాలంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య కలశాలను స్థాపించారు. ఈఓ విజయరాజు ఆధ్వర్యంలో వేద, రామాయణ పారాయణం, ఆరాధనలు, ద్వారతోరణ పూజ, ఉప కుంభారాధన, చతుస్థానార్చన, మూల మంత్ర హవనం, మన్యుసూక్త హవనం, పంచ సూక్త హవనం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తన కుటుంబ సభ్యులతో కలిసి క్రతువుల్లో పాల్గొన్నారు. తూర్పు గోపుర శిఖర కలశ స్థాపనలో ఎమ్మెల్యేలు కాలవ, గుమ్మనూరు పాల్గొన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, పరిటాల సునీత, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, గుంతకల్లు మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, మాజీ చైర్మన్ ఎన్ రామలింగప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారు.





గోపురాలను సందర్శించి పూజ చేస్తున్న ఎంపీ అంబికా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్

వర్షానికి కూలిన పూరిల్లు

● పరిహారం కోసం తహసీల్దార్‌కు వినతి



వర్షానికి కూలిన పూరిల్లు

తనకల్లు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బంగారువాండ్లపల్లికి చెందిన రామప్ప పూరి గుడిసె ఇటీవల కురిసిన వర్షాలకు తడిసి గురువారం రాత్రి కూలిపోయింది. అతడి కుటుంబ సభ్యులంతా బెంగళూరులో ఉండడం, అతడు రాత్రి బయట పడుకుని ఉండడంతో ఎవరికీ ఎటు వంటి హానీ జరుగలేదు. అయితే ఇంట్లో ఉన్న తిండి గింజలు, వంట సామగ్రి, బట్టలు, వ్యవసాయ పనిముట్లు ధ్వంసమయ్యాయి. దీంతో రూ. లక్ష ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు రామప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి, పక్కాగృహం మంజూరు చేయాలని కోరాడు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షాబుద్దీన్‌కు వినతి పత్రం సమర్పించాడు. ప్రస్తుతం పడిపోయిన ఇంటికి పైన పట్టకట్టుకొని ఉంటున్నాడు.

క్రైం కార్నర్

ఎలుగుబంట్ల సంచారంతో బెంబేలు


భూతప్ప కనుమలో పగటిపూటే సంచరిస్తున్న ఎలుగుబంటి

గుడిబండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూతప్ప కనుమలో పగటి పూటే ఎలుగుబంట్లు సంచరిస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మండలంలోని మందలపల్లి, పిసిగిరి, బైరేపల్లి, దాసరపల్లి, కరేకెర, కెడిపాల్యం, రామయ్యన, కొంకల్లు, ఎస్ రాయాపురం, పూజారిపల్లి, గుడిబండ, జీఎస్‌తాండా, ఎమ్మెఎస్ తండా, మేకలగట్ట, ఎఎస్ఎస్ గుండ్లు, సంకరగల్లు, రాళ్లపల్లి, ముదిగుబ్బ తదితర గ్రామాలు అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్నాయి. చిరుత పులులు, ఎలుగుబంట్లు అధికంగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నాలుగు నెలల కిందట ఎస్ రాయాపురంలో బూతరాజుపై ఎలుగుబంటి దాడి చేసింది. అలాగే వీరక్యాతప్ప పాడి ఆవుపై చిరుత దాడి చేసింది. గుడిబండలో చిరుత పులల సంచారంతో ప్రజలు రాత్రి పూట బయటకు రావడానికి భయపడుతున్నారు. సంబంధిత శాఖాధికారులు స్పందించి ఎలుగుబంట్లు, చిరుతపులులను బంధించి ఇతర ప్రాంతాలకు తరలించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఏడాది తర్వాత తల్లిదండ్రుల వద్దకు..!

● తప్పిపోయిన బాలుడిని అప్పగించిన పోలీసులు


బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

రాయదుర్గం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గొర్రెలు మేపడం ఇష్టం లేక ఏడాది కిందట పారిపోయిన బాలుడు వడ్డే ఆంజనేయులును పోలీసులు శుక్రవారం అతడి తల్లిదండ్రులకు అప్పగించారు. గుమ్మఘట్ట మండలం గోనబావి గ్రామానికి చెందిన వడ్డే మారెప్ప, వడ్డే ఈరక్కల మూడో కుమారుడు వడ్డే అంజజినేయులు గొర్రెలను మేపడానికి వెళ్తుండేవాడు. చదువుకోవాలనే ఆలోచన ఉన్నప్పటికీ తల్లిదండ్రుల ఒత్తిడి తట్టుకోలేక గొర్రెల వెంట వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో విసుగు చెంది గత ఏడాది అక్టోబరు 15న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కొడుకు ఆచూకీ కోసం అన్ని చోట్లా గాలించిన తల్లిదండ్రులు చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై గుమ్మఘట్ట పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వడ్డే ఆంజనేయులు కోసం అటు కర్ణాటక, రాష్ట్రంతో పాటు సుదూర ప్రాంతాలలో గాలించారు. చివరకు ప్రత్యేక బృందం బెంగళూరు నగరంలో గుర్తించి, బాలుడిని తెచ్చి శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ వెంకటరమణ తెలిపారు.

రెండు లారీలు ఢీ: డ్రైవర్ మృతి

శింగనమల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి బ్రిడ్జి మీద రెండు లారీలు ఢీ కొనడంతో డ్రైవర్ హరీష్(30) మృతి చెందాడు. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన మేరకు... గురువారం అర్ధరాత్రి అనంతపురం నుంచి ప్రొద్దుటూరుకు వెళ్లేందుకు లారీలో సరుకులు(గూడ్సు) వేసుకుని కనగానపల్లికి చెందిన డ్రైవర్ హరీష్ బయల్దేరాడు. పెరవలి గ్రామ సమీపంలో బ్రిడ్జి మీద తాడిపత్రి నుంచి అనంతపురానికి సిమెంట్ లోడుతో వస్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో గూడ్స్ లారీ నుజ్జై డ్రైవర్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. రోడ్డు ప్రమాదాన్ని స్థానికులు, వాహనదారులు గమనించి ఎక్స్‌కవేటర్ ద్వారా క్యాబిన్‌ను తొలగించి డ్రైవర్‌ను కాపాడే ప్రయత్నం చేశారు. అయితే తీవ్రంగా గాయపడిన డ్రైవర్ హరీష్ అప్పటికే మృతి చెందాడు మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. శింగనమల పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బొలెరో బోల్తా.. ఒకరి మృతి


గొల్ల రాజన్న (ఫైల్)

కళ్యాణదుర్గం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోళ్ల గ్రామం వద్ద శుక్రవారం బొలెరో బోల్తా పడి మేకల రాజన్న(45) అనే వ్యక్తి మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. శెట్టూరు మండలానికి చెందిన ఏడుగురు కూలీలు వుచ్చకాయల పంట కోత కోసం పామిడికి వెళ్లి, తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. గోళ్ల ఆంజ నేయస్వామి గుడి వద్ద టైరు పేలి వాహనం బోల్తా పడిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో రాజన్న అక్కడికక్కడే మృతి చెందారు. శివకృష్ణ, మంజు, శంకర తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మేకల రాజన్నకు భార్య సావిత్రమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈకేవైసీ గడువు పొడిగింపు

అనంతపురం అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అక్రమాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్)ను అమలు చేయనుంది. ఇందు కోసం అక్టోబరు 1 నుంచి ఉపాధి కూలీలతో ఈకేవైసీ చేయడం మొదలు పెట్టింది. ఈ విధానంలో ఉపాధి కూలీల ఐరిస్ ఫొటో తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అక్టోబరు నెలాఖరులోగా ఈకేవైసీ పూర్తి చేయాలని గడువు విధించారు. నవంబరు 1 నుంచి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. అయితే సర్వర్ సమస్యతో గడువులోగా ఈకేవైసీ పూర్తి చేయకపోయారు. క్షేత్ర స్థాయిలో నెలకొన్న సమస్యలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం మరో వారం రోజులు గడువు పొడిగించింది. జిల్లా వ్యాప్తంగా 542526 మంది ఉపాధి కూలీలు ఉండగా.. ఇప్పటి దాకా 388013 మందికి (71.52 శాతం) ఈకేవైసీ పూర్తి చేశారు. ఇంకా 154513 మందికి ఈకేవైసీ పెండింగ్‌లో ఉంది. పొడిగించిన గడువులోగా ఉపాధి కూలీలందరితో ఈకేవైసీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ సలీం బాషా పేర్కొన్నారు.

ఉచితంగా ట్యాలీ శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు బెంగళూరులో ఉచితంగా ట్యాలీ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదివి 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 10 నుంచి 35రోజుల పాటు బెంగళూరులో ఇచ్చే ఉచిత శిక్షణలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఆయా సంస్థలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 9000487423ను సంప్రదించాలని కోరారు.

అవగాహన పెంచుకోండి: డీఆర్‌డీఏ పీడీ

● 'మన డబ్బులు - మన లెక్కలు'పై సీసీలకు శిక్షణ

అనంతపురం అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మన డబ్బులు - మన లెక్కలుకు సంబంధించిన మొబైల్ బుక్ కీపింగ్‌పై అవగాహన పెంచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శైలజ సూచించారు. శుక్రవారం స్థానిక ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో మన డబ్బులు - మన లెక్కలపై ఎంపిక చేసిన సీసీలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మన డబ్బులు - మన లెక్కలకు సంబంధించిన మొబైల్ యాప్‌లో వివరాలు ఎలా నమోదు చేయాలి, తదితర అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ రాధారాణి, ఐబీ డీపీఎం రాజ్యలక్ష్మి, ఏపీఎం భాస్కర్‌నాయుడు, ఐటీ యాంకర్ చంద్రదర్ తదితరులు పాల్గొన్నారు.

భాషపై పట్టు సాధించండి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు సూచన
● విజయనగర లా కళాశాలలో గేట్ వే సెలబ్రేషన్స్ న్యూవేవ్


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు

అనంతపురం రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రతి న్యాయ విద్యార్థి భాషపై పట్టు సాధించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు అన్నారు. విజయనగర లా కళాశాల నూతన విద్యా సంవత్సర ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గేట్ వే సెలబ్రేషన్స్ న్యూవేవ్ పేరిట శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు, జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి సత్యవాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన విషయ పరిజ్ఞానంతోపాటు అవసరానికి అనుగుణంగా అవతలి వ్యక్తికి అర్థమయ్యేలా చెప్పటం ఎంత అవసరమో ఉదాహరణలతో విద్యార్థులకు వివరించారు. వినియోగించే ప్రతి పదానికి అర్థాలు, నానార్థాలు తెలుసుకోవడంతో పాటు తమ జ్ఞానాన్ని ఎక్కడ ఏ సందర్భంలో ఎలా వినియోగించాలో వంటి లౌకిక జ్ఞానం అవసరమని తెలిపారు. జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి సత్యవాణి మాట్లాడుతూ న్యాయ విద్యార్థిగా ప్రారంభమైన చదువు న్యాయవాది అయిన తరువాత కూడా కొనసాగితేనే సమర్థవంతంగా న్యాయసేవలు అందించగలుగుతారన్నారు. ప్రస్తుతం న్యాయ విద్యార్థులకు ఎన్నో సదుపాయాలు, వృత్తిలో మెరుగైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు రామిరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ రాఘవేంద్రచార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరిగితే కఠిన చర్యలు: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో బాల్య వివాహ నిరోధక సమన్వయ కమిటీ/మిషన్ శక్తి జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బాల్యవివాహాలు, మానభంగం, ఉమెన్ ట్రాఫికింగ్, గృహహింస, వేధింపుల కేసులకు సంబంధించి వన్ స్టాప్ సెంటర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, పోలీస్ వారు కలిసికట్టుగా పని చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. బాల్య వివాహాలపై సచివాలయాల వారిగా అందరికీ అవగాహన కల్పించాలన్నారు. టీనేజ్ ప్రెగ్నెన్సీలు రాకుండా చూసుకోవాలని, ఆదేశించారు. బాలికలు 10రోజుల పాటు పాఠశాలలకు రాకపోతే అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు వారి ఇంటి వద్దకెళ్లి కారణాలు ఆరాతీయాలన్నారు. జిల్లాలో సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు 13 బాల్యవివాహాలు నమోదు కాగా, ప్రతి కేసులోనూ బైండోవర్స్ జరగాలని డీపీఓని ఆదేశించారు. సమావేశంలో జిల్లా లీగల్ అథారిటీ సర్వీసెస్ సెక్రటరీ రాజశేఖర్, ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, డీసీఓ మంజునాథ్, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, డీఈఓ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అండర్-14 జిల్లా బాలుర క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు వివరాలను స్థానిక ఆర్డీటీ స్టేడియంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి శుక్రవారం వెల్లడించారు. జట్టులో బురానుద్దీన్, హేమచంద్ర నాయక్, ఆహిల్‌రాజా, పంకజ్ మీనా, ప్రాణధీర్, మోక్షన్‌తేజ్, కుశ్వంత్ సాయికృష్ణ, రాహిత్ రెడ్డి, కృతికసాయి, మన్నన్, గౌతమ్ ఆదిత్య, జస్వంత్‌సాయి, దేవస్కంద, రోహితేశ్వర్ రాజ్, తెడ్రిక్ విక్రాంత్, రోహిత్ ఉన్నారు. కోచ్‌గా అహ్మద్‌రఫీని నియమించారు. ఈ జట్టు శనివారం నుంచి కడపలో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందన్నారు.

చురుగ్గా లీజు ప్రాంతాల హద్దుల గుర్తింపు


పాయింట్‌ను గుర్తిస్తున్న బృందం

రాయదుర్గం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): డి.హీరేహాళ్ మండలంలోని ఇనుప గనుల కొండల్లో లీజుప్రాంతాల హద్దుల గుర్తింపు ప్రక్రియ శుక్రవారం చురుకుగా సాగింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో రెండురోజులుగా జరుగుతున్న పనులు శుక్రవారం కూడా కొనసాగాయి. అటవీశాఖ, మైన్స్ అండ్ జియాలజీతో పాటు ల్యాండ్ రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పర్యటించి ఆరు మైనింగ్ లీజుల ప్రాంతాల హద్దులను గుర్తించారు. ఓఎంసీతో పాటు వైఎం, ఏఎంసీ, బీఐటీ లీజులకు సంబంధించి జీపీఎస్ పాయింట్లను గుర్తించి, రాళ్లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా లీజు ప్రాంతాల్లో కేటాయింపుల్లో కాకుండా ఇతరత్రా ప్రాంతాల్లో తవ్వకాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డ్రోన్ల ద్వారా సర్వే నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేశారు. కార్యక్రమంలో మైన్స్ జియాలజీ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సర్వే రీజనల్ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సర్వే ల్యాండ్ రికార్డ్ అధికారి రూప్లానాయక్, డీఎఫ్ఓ గురుప్రభాకర్, సర్వేయర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఏడు రోజుల్లో 114 బస్సుల తనిఖీ: డీటీసీ


మాట్లాడుతున్న డీటీసీ వీర్రాజు

అనంతపురం టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గత ఏడు రోజుల్లో 114 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వీర్రాజు వెల్లడించారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమా ద ఘటన నేపథ్యంలో గత ఏడు రోజులుగా బస్సులను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. సీట్ అల్రేషన్, ఫైర్ డిటెక్షన్ అలారమ్, అగ్ని ప్రమాద నియంత్రణ పరికరాలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్ పనితీరు వంటి అంశాలను తనిఖీల్లో పరిశీలించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో 49 బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. రోడ్డు భద్రత నియమాలకు విరుద్ధంగా నడుపుతున్న రెండు బస్సులను సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని స్కూల్, కాలేజీల బస్సులను తనిఖీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని, శనివారం నుంచి పది రోజులపాటు స్కూల్, కాలేజీ బస్సులతో పాటు అన్నిరకాల బస్సులను తనిఖీ చేస్తామన్నారు.

రైల్వే అభివృద్ధికి ప్రధాని కృషి


మాట్లాడుతున్న రైల్వే అధికారి

గుత్తి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశ అ భివృద్ధికి మూల స్తంభమైన రైల్వే శాఖ సమ గ్ర అభివృద్ధి కోసం ప్ర ధాని మోదీ కృషి చేస్తున్నారని రైల్వే శాఖ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ హోనుక్ కుమార్, రైల్వేస్టేషన్ మేనేజర్ సురేష్‌బాబు, ఐడబ్ల్యు నాగేశ్వర్ నాయక్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం అమృత్ సంవాద్ 5.0 పథకం గురించి అవగాహన సద స్సు నిర్వహించారు. డివిజన్‌లో ప్రధాన మైన గుత్తి రైల్వే జంక్షన్‌ను అభివృద్ధిపరిచేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ప్రయాణికులు సౌకర్యార్థం స్టాల్స్, క్రీడా సౌకర్యాలు తదితర వాటిని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సమావేశంలో రైల్వే జంక్షన్ అభివృద్ధి కమిటీ సభ్యులు విజయ్‌భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు ఆర్మీ కమాండర్


కమాండర్ దంపతులను సన్మానిస్తున్న వేద పండితుడు

తాడిపత్రి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి, చింతల వెంకటరమణ స్వామి, సంజీవనగర్ షిర్డిసాయిబాబా ఆలయాలను ఆర్మీ కమాండర్ అలోక్ త్రిపాఠి దంపతులు శుక్రవారం సందర్శించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయాల విశేషాల గురించి వేద పండితులను అడిగి తెలుసుకున్నారు.

పొగాకుకు దూరంగా ఉండాలి: డీఈఓ

అనంతపురం విద్య, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పొగాకు వినియోగానికి ప్రతిఒక్కరు దూరంగా ఉండాలని డీఈఓ ప్రసాద్ బాబు సూచించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం పొగాకు అనర్థాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా పొగాకుకు అందరూ దూరంగా ఉండాలని కోరుతూ తమ శాఖ అధికారులు, ఉద్యోగులతో డీఈఓ ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పొగాకు అనర్థాలపై ఇతరులకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే పాఠశాలల సమీపంలో పొగాకు వస్తువులు అమ్మడం చట్టవ్యతిరేకమని, అలా ఎక్కడైనా అమ్మకాలు చేస్తుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టరు నారాయణస్వామి, విద్యా శాఖ ఏడీలు మునీర్, శ్రీనివాసులు, సూపరింటెండెంట్లు ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, సామాజిక కార్యకర్త శ్రీరాములు, ఇతర విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


పొగాకు వద్దు అంటూ ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఈఓ

దేశానికే ఏపీ రోల్‌మోడల్

● కాలుష్య నియంత్రణ బోర్డు చైర్మన్ కృష్ణయ్య

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్క్యులర్ ఎకానమీ వేస్ట్ రీసైక్లింగ్ పాలసీని అమలు చేయడంలో దేశానికి మన రాష్ట్రం రోల్‌మోడల్‌గా నిలవనుందని కాలుష్య నియంత్రణ బోర్డు చైర్మన్ కృష్ణయ్య తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సర్క్యులర్ ఎకానమీ వేస్ట్ రీసైక్లింగ్ పాలసీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్ర వ్యాప్తంగా సర్క్యులర్ ఎకానమీ వేస్ట్ రీసైక్లింగ్ పాలసీని క్రమపద్ధతిలో అమలు చేయాలన్నారు. డీఆర్‌డీఏ, ఉద్యానశాఖ, స్వచ్ఛందసంస్థల సహకారంతో వ్యర్థాల నిర్వహణలో ఉపాధి కల్పన కోసం కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ఉక్కుపాదం మోపాలన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ పారిశ్రామిక వాడల వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలలో ఉత్పత్తి చేసే ఘన వ్యర్థాలను, సిమెంట్ బట్టీలలోని వ్యర్థాలను కోప్రాసెసింగ్ ద్వారా రీసైక్లింగ్ చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం సర్క్యులర్ ఎకానమీ వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ పోస్టర్లు ఆవిష్కరించారు. డీఆర్ఓ మలోలా, డీఆర్‌డీఏ పీడీ శైలజ, కాలుష్యనియంత్రణ మండలి ఈఈ కిషోర్ కుమార్ రెడ్డి, ఈఏ కృష్ణారెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చైర్మన్ కృష్ణయ్య, కలెక్టర్ ఆనంద్ తదితరులు


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అహుడా చైర్మన్ టీసీ వరుణ్

ఈ-వేలంలో లబ్ధిదారుల ఎంపిక

● అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అహుడా ఎన్టీఆర్ స్మార్ట్ లేఅవుట్లలో అవకతవకలకు చోటు లేకుండా ఈ-వేలం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అహుడా చైర్మన్ టీసీ వరుణ్ తెలిపారు. స్థానిక అహుడా కార్యాలయంలో శుక్రవారం ఆయన వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీసీ వరుణ్ మాట్లాడుతూ ఒక కుటుంబానికి ఒక ప్లాట్ నిబంధనను అహుడాలో సవరిస్తూ, ఆసక్తి ఆర్థిక స్తోమత ఉన్న వారు ఎన్ని ప్లాట్లు అయినా కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని తెలిపారు. అహుడా పరిధిలోని ఎన్టీఆర్ లేఅవుట్లలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. త్వరలో అహుడా అధికారిక వెబ్‌సైట్ ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ కేఎండి ఇషాక్, జేపీఓ హరీష్‌చౌదరి, ఈఈ దుష్యంత్, డీఈ రేవంత్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఏఈ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పది రోజుల్లో ఖాతాల్లోకి కూలి డబ్బు: పీడీ


ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

గార్లదిన్నె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): 'ఉపాధి హామీ పథకం కూలీలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదు. పది రోజుల్లో ఖాతాల్లోకి కూలి డబ్బులు జమ అవుతాయి' అని డ్వామా పీడీ సలీం బాషా పేర్కొన్నారు. మండలంలోని పెనకచెర్ల, డ్యాం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన కందకాలు, ఇంకుడు గుంతలు తవ్వకం తదితర పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. చేసిన పనికి కూలి డబ్బులు పడటం లేదని పలువురు కూలీలు ఆయన వద్ద వాపోయారు. దీంతో త్వరలోనే మీ బ్యాంకు ఖాతాల్లోకి కూలి డబ్బు జమ అవుతుందని పీడీ వారికి భరోసా ఇచ్చారు. అనంతరం ఇంకుడు గుంతల ప్రయోజనం గురించి రైతులను ప్రశ్నించి, సమాధానాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఏపీఓ ఓబన్న, టెక్నికల్ అసిస్టెంట్ వనం రామాంజినేయులు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 50 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఓటీపీఆర్ఐలో ప్రాంగణ నియామకాలు

అనంతపురం రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ అనుబంధ కళాశాల ఓటీపీఆర్ఐ(తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ)లో ప్రాంగణ నియామకాలు చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రాంగణ నియామకాల ఇంటర్వ్యూ లు నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ ఆచార్య జీవీ సుబ్బారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అక్టోబరు నెలలో దివీస్ లేబొరేటరీస్ వారు రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంగణ నియామకాల ప్రణాళికను విడుదల చేశారన్నారు. ఈనేపథ్యంలో తమ సంస్థ నుంచి 45మంది ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. సంస్థ మానవ వనరుల విభాగానికి చెందిన ప్రతాప్, శ్రీహరి 25మంది విద్యార్థులకు లిఖిత పూర్వక, మౌఖిక పరీక్షలను నిర్వహించారన్నారు. ఇందులో 20మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపీనాథ్, ఓటీపీఆర్ఐ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ మహేష్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే దగ్గుపాటి



స్వామి వారి ఆలయం వెలుపల ఎమ్మెల్యే తదితరులు

అనంతపురం క్రైం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ దర్శించుకున్నారు. ఆయన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రమణ్యం, ఇతర నాయకులు, బంధువులతో కలిసి తిరుమలకు వెళ్లారు. వీఐపీ బ్రేక్ దర్శనంలో భాగంగా శుక్రవారం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తర్వాత వారికి వేదపండితులు తీర్థ ప్రసాదాలు, వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు.

అనంతలక్ష్మిలో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన విద్యార్థులతో ఇటుకలపల్లి సీఐ

అనంతపురం రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుకలపల్లి సమీపంలో గల అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పోలీసుల అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన 30మంది విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం విద్యాసంస్థల చైర్మన్ అనంతరాముడు మాట్లాడుతూ..సమాజ భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీసుల అమరవీరులను స్మరించుకుంటూ నిర్వహించిన రక్తదాన శిబిరంలో కళాశాల విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఇటుకపల్లి సీఐ హేమంత్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రక్తదాన చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కళాశాల జాతీయ సేవా పథకం అధికారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంటు పునఃప్రారంభం



వాటర్‌ప్లాంటును పునఃప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

రామగిరి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కంపల్లి గ్రామంలో గల మినరల్ వాటర్ ప్లాంటు ఏడాదికి పైగా మూతపడింది. దీంతో గ్రామస్థులు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఇటీవల ఎమ్మెల్యే పరిటాలసునీత, ధర్మవరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు వెంటనే పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ద్వారా రూ. లక్ష వ్యయంతో ప్లాంట్‌లో పాడైన పరికరాలను తొలగింపజేసి కొత్తవాటిని ఏర్పాటు చేయించారు. ఆ ప్లాంట్‌ను శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులు ప్రారంభించారు. వాటర్ ప్లాంటును వినియోగంలోకి తీసుకురావడంతో గ్రామస్థులు పరిటాలసునీత, పరిటాల శ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ప్రభాకర్, చంద్రాయుడు, ప్రేమ్‌కుమార్, చంద్రశేఖర్, నారాయణ, తిప్పన్న పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

అనంతపురం విద్య, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ అనంత నగర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక పొట్టిశ్రీరాములు పాఠశాలలో శుక్రవారం ఏపీటీఎఫ్ నాయకులు సమావేశం ఏర్పాటు చేసి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.శ్రీనివాసులు, ప్రధానకార్యదర్శిగా ఎ.గోవర్ధన్, గౌరవాధ్యక్షుడిగా పట్నం శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా విజయశ్రీ, కలీముల్లాఖాన్, నజరుల్లా, కార్యదర్శులుగా సోమశేఖర్, ఇందాదుల్లా, అరుణ, జిల్లా కౌన్సిలర్లుగా సాయప్ప, నారాయణస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీని పలువురు నాయకులు, టీచర్లు అభినందించారు.

ఇంకా రేషన్ షాపులకు చేరని బియ్యం

● తలలు పట్టుకుంటున్న డీలర్లు

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అనంతపురం, రూరల్ పరిధిలోని రేషన్ షాపులకు బియ్యం ఇంకా చేరలేదు. ప్రతి నెలా 20వ తేదీకే రేషన్ షాపులకు నిత్యావసర సరుకులు చేరేవి. ఇప్పుడు నెల పూర్తయినా సరుకులు రాకపోవడంతో కార్డుదారులు వస్తే ఏం చెప్పాలో తెలియడం లేదని ఆ డీలర్లు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో అన్ని ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్‌షాపులకు ఇప్పటికే బియ్యం, చక్కర సరఫరా అయ్యాయి. కానీ అనంతపురం, రూరల్ మండలంలోని రేషన్ షాపులకు రాప్తాడు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి నిత్యావసర సరుకులు సరఫరా కాలేదు. దీంతో డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద పడిగాపులు కాస్తున్నారు.

కాంట్రాక్టర్ ఎఫెక్ట్...

ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యం తదితర నిత్యావసర సరుకులు ఒక కాంట్రాక్టు సంస్థ సరఫరా చేస్తుంది. అనంతరం ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి సంబంధిత రేషన్ షాపులకు మరో కాంట్రాక్టర్ సరఫరా చేస్తారు. రాప్తాడుకు చెందిన కాంట్రాక్టర్ తనకు గిట్టుబాటు కాలేదంటూ తాజాగా తప్పుకున్నారు. దీంతో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అధికారులు తలలు పట్టుకోవాల్సి వచ్చింది. అప్పటికప్పుడు వాహనాలు సమకూర్చినా వీలు లేకపోయింది. అనంతపురం, రూరల్ పరిధిలో మొత్తం 230వరకు రేషన్ షాపులున్నాయి. అయితే ఇప్పటివరకు అనంతపురంలో కనీసం 25దుకాణాలకు కూడా సరుకులు సరఫరా కాలేదని సమాచారం.

లెక్కలోకి రావడానికి థంబ్..

ప్రతి నెలా ముందుగా 26 నుంచి 30వ తేదీ వరకు దివ్యాంగులకు, వృద్ధులకు ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అనంతపురం పరిధిలో ఇలాంటి కుటుంబాలు చాలానే ఉన్నాయి. అయితే వారికిచ్చే గడువు పూర్తవడంతో డీలర్లు తలలు పట్టుకుంటున్నారు. ఇదిలా ఉండగా అనంతపురం రూరల్ పరిధిలో కొందరు డీలర్లు షాపులకు వచ్చే ప్రజలకు థంబ్ వేసి పంపుతున్నారట. లెక్కలోకి రావటానికి స్థానిక అధికారులు ఈ ప్రయత్నాలు చేయమ ని చెప్పినట్లు తెలిసింది.

నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

అనంతపురం రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంటలో శుక్రవారం నేషనల్ సర్వీస్ స్కీమ్ ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులు నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా మత్తు పదార్థాలు వాడటం వల్ల కలిగే నష్టాలను గ్రామస్థులకు వివరించారు.

ముందుకు పారని మురుగు

● రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త
● ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, కంపచెట్లు
● సమస్యల్లో విద్యుత్‌నగర్-2 కాలనీ
● ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు



డ్రైనేజీ కాలువలో నిలిచి ఉన్న మురుగునీరు



నివాసాల మధ్యన ఏపుగా పెరిగిన కంపచెట్లు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన కాలనీల్లో ఒకటైన విద్యుత్తునగర్-2 సమస్యల వలయంలో చిక్కుకుంది. అటు విద్యుత్‌నగర్, ఇటు హౌసింగ్‌బోర్డు మధ్యలో ఉండే విద్యుత్తునగర్-2లో వివిధ సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. ముఖ్యంగా మురుగు కాలువ పారకపోవడంతో నీరు రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు ఇళ్లలోని చెత్తను నివాసాల మధ్య పడేయడంతో సమస్య మరింత జఠిలమవుతోంది. ఇక కాలనీలో ఇళ్ల మధ్యన ఖాళీ స్థలాల్లో కంపచెట్లు , పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వాటి వల్ల విషపురుగుల భయం స్థానికుల్లో నెలకొంది. అలాగే సీసీ రోడ్లు లేకపోవడంతో మట్టిరోడ్లపైనే రాకపోకలు సాగిస్తున్నారు. మట్టిరోడ్డుపై భారీ గుంతలు ఏర్పడడంతో నానా అవస్థలు పడుతున్నారు. మురుగు కాలవలు శుభ్రం చేసి, ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా చేపట్టి, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని ఇప్పటికే స్థానికులు పలుమార్లు నగరపాలక సంస్థ అధికారులకు విన్నవించారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి మురుగు కాలవలను శుభ్రం చేసి, ని వాసాల మధ్య పేరుకుపోయిన చెత్తను తొలగించి తమ ఆరోగ్యాలను కాపాడాలని వారు కోరుతున్నారు.

నగరానికి 'అనంత' ఏం చేశారో చెప్పాలి: టీడీపీ




మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం క్రైం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి నగరానికి ఏం చేశారో చెప్పాలని అనంతపురం అర్బన్ టీడీపీ నాయకులు ప్రశ్నించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి ఫిరో జ్ అహ్మద్, కార్పొరేటర్లు జనబలం బాబా, బాలాంజనేయులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం చంద్రబాబుపై పలు విమర్శలు చేస్తున్న అనంతవెంకట్రామిరెడ్డి తన 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో అనంతపురం నగరానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 20 ఏళ్లుగా సాగునీటికి నోచుకోని ప్రాంతాల్లో సైతం ప్రస్తుతం పంటలు పండుతున్నాయని, ఆ ఘనత సీఎం చంద్రబాబుదేనని తెలిపారు. వ్యవసాయం, రైతుల గురించి మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు. కబ్జాలు, లిక్కర్, రేషన్ మాఫియాకు వారు బ్రాండ్ అంబాసిడర్లు అంటూ మండిపడ్డారు. అనంత వెంకట్రామిరెడ్డి ఎన్ని కుట్రలు చేసి.. ఎందరి మహిళల తాళిబొట్లు తెంచారో తెలుసన్నారు. పేదలకు ఇచ్చే డీసీ ల్యాండ్స్‌ను కూడా వదల్లేదన్నారు. బంధువు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేపట్టిన అక్రమ మద్యం ద్వారా మీరు ఎంత సంపాదించారో ప్రజలందరికీ తెలుసునన్నారు. ఏనాడూ అసెంబ్లీలో అనంతపురం అభివృద్ధి గురించి మాట్లాడని మీరు ఇప్పుడు సీఎం చం ద్రబాబుపై, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌పై విమర్శలు చేయడం సరికాదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నేతలు కంతాదేవి, దళవాయి రమాదేవి, నాయకులు నారాయణస్వామి, వడ్డే వెంకటేష్, రామలిం గం, చెరుకూరి సుధాకర్, నాగార్జున, శివ , జయరాం తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువ నిర్మాణం

● మారుతీనగర్ వాసులకు తప్పిన మురుగునీటి సమస్య



మారుతీనగర్‌లో నిర్మితమైన డ్రైనేజీ కాలువ

గార్లదిన్నె, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకింద కల్లూరులో గల మారుతీనగర్‌లో కొన్నేళ్లుగా డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో ఇళ్లలోంచి వచ్చే మురుగు నీరంతా రోడ్లపై ప్రవహిస్తుండేది. దీంతో రోడ్లపై చిత్తడి ఏర్పడడంతో పాటు దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు తీవ్రఇబ్బందులు పడుతుండేవారు. కూటమి అధికారంలోకి రాగానే గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి చొరవతో కొండకింద కల్లూరులోని మారుతీనగర్‌లో రూ. 6 లక్షల వ్యయంతో డ్రైనేజీ కాలువ నిర్మించారు. దీంతో కాలనీలో మురుగునీటి సమస్య తప్పిందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎర్రమట్టి, ఇసుకను అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు

● అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

బుక్కరాయసముద్రం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): శింగనమల నియోజకవర్గంలో ఎక్కడైనా ఇసుక, ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు హెచ్చరించారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన బుక్కరాయసముద్రం ,శింగనమల సీఐలు పుల్లయ్య, కౌలుట్లయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో ఇటీవల ఎర్రమట్టి , ఇసుక అక్రమ తరలింపు అధికమైందన్నారు. గతంలో బీకేఎస్ స్టేషన్ పరిధిలో 17 కేసులు నమోదు చేశామని, అందులో 17 ట్రాక్టర్లు, 3 టిప్పర్లు, 3 ఎక్స్‌కవేటర్‌లు, 4 హిటాచీలు సీజ్ చేసి మైనింగ్ అధికారులకు పంపి రూ.2లక్షల 64 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఇకపై జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. పలుసార్లు కేసులు నమోదు అయితే పీడీ యాక్టు పెడుతామని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఎక్కడైనా అనుమతులు లేకుండా ఎర్రమట్టిని, ఇసుకను అక్రమంగా తరలిస్తే ఎంతటివారిపైన అయినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపై వాటి అక్రమరవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి అడ్డుకట్టు వేస్తామన్నారు. అక్రమంగా ఎవరైనా తరలిస్తే 9440796816, 9346010556కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

8 మంది బైండోవర్

రామగిరి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంతిమర్రి గ్రామానికి చెందిన 8 మందిని ఎస్ఐ సుధాకర్‌యాదవ్ తహసీల్దార్ రవికుమార్ ఎదుట బైండోవర్ చేశారు. గంతిమర్రిలో శుక్రవారం ఉదయం వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటుకోసం వాల్మీకి కులస్థులు రాళ్లు తోలుతుండగా అదే గ్రామానికి చెందిన యాదవులు శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని అక్కడే సమీపంలో రాళ్లు తోలేందుకు ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇరువర్గీయులు వాదోపవాదాలు చేసుకున్నారు. విషయం తెలిసిన వెంటనే వారిని రామగిరి పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

హాస్టల్‌కు సామగ్రి వితరణ

అనంతపురం విద్య, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అరవిందనగర్‌లో గల బీసీ బాలికల కళాశాల సంక్షేమ హాస్టల్‌కు దాతలు చేయూతనందించారు. విద్యార్థులకు ఉపయోగపడే దాదాపు రూ. 10 లక్షలు విలువ చేసే 50 లాకర్ల అల్మారాలు, 10బంకర్ బెడ్లు, వాటర్‌ప్లాంట్, 4ఆఫీస్ అల్మారాలు తదితర సామగ్రిని శుక్రవారం వితరణ చేశారు. బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి సమక్షంలో వార్డెన్ ఆదిలక్ష్మికి కెనరాబ్యాంకు ఆఫీసర్ హరీష్, కాంపిన్‌హోమ్స్‌లిమిటెడ్ మేనేజర్ దేవరాజ్ వాటిని అందజేశారు. అనంతరం దాతలకు సన్మానం జరిగింది. కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీవెల్ఫేర్ అధికారి సుభాషిణి, వార్డెన్లు సుజాత, సహింతాజ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

6 - ఏ కేసు నమోదు

అనంతపురం అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని కళ్యాణదుర్గం రోడ్డులో గల ఎన్ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణం యజమానిపై 6 - ఏ కేసు నమోదైంది. కనగానపల్లి మండలం బోయవాండ్లకొట్టాల గ్రామానికి చెందిన రైతు మోహన్ ఈ ఎన్ఆర్ ఫర్టిలైజర్స్‌లో ఇటీవల ఎరువులు కొనుగోలు చేశాడు. అ యితే సదరు డీలర్ రైతుకు రసీదు ఇవ్వకుండా పేపర్‌పై ధరలు రాసి ఇచ్చాడు. ఈ విషయంపై ఆ రైతు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మకు ఫిర్యాదు చేశాడు. ఆ అధికారి ఆదేశాల మేరకు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, ఏఓ వెంకటకుమార్ ఎన్ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణంలో గత గురువారం తనిఖీలు చేశారు. ఈ సమయంలో ప్రభుత్వ అనుమతి లేని 3 కంపెనీలకు చెందిన రూ.26 లక్షల విలువైన కాంప్లెక్స్ ఎరువులను సీజ్ చేశారు. దీనిపై శుక్రవారం జిల్లా కలెక్టర్ కోర్టులో ఎన్ఆర్ ఫర్టిలైజర్స్ యజమానిపై 6- ఏ కేసు నమోదైంది.

దిశ కమిటీ సమావేశం వాయిదా

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లాలో శనివారం నిర్వహించాల్సిన దిశ కమిటీ సమావేశాన్ని వాయిదా వేసినట్లు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తలుపుల మండలం పర్యటన నేపథ్యంలో దిశ కమిటీ సమావేశాన్ని వాయిదా వేయడం జరిగిందన్నారు. గౌరవ సభ్యులు, జిల్లా అధికారులు ఈ మార్పును గమనించాలని కోరారు. తదుపరి సమావేశం ఎప్పుడన్నది మరోసారి ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

పరిష్కారం దిశగా పాపంపేట భూ వివాదం

● హక్కు విడుదలకు సిద్ధమని రాచూరి కుటుంబీకుల ప్రకటన



మీడియాతో మాట్లాడుతున్న రాచూరి వెంకటరమణ, వెంకటకిరణ్

అనంతపురం రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పాపంపేట భూ వ్యవహారంపై గత పదిహేను రోజులుగా ఎక్కడ చూసినా విపరీతమైన చర్చ జరుగుతోంది. పాపంపేట భూములను జీపీ చేసుకున్నారని, ఇళ్ల స్థలాలను లాక్కుంటారని, ఇళ్లను కూల్చివేస్తారంటూ మాట్లాడుకోవడం జరుగుతోంది. అయితే గత వారం రోజుల కిందట టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పాపంపేటలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి భూ వివాదంపై వస్తున్న ఆరోపణల పట్ల తీవ్రంగా స్పందించారు. కూలంకశంగా భూ వివాదం గురించి వివరించారు. పాపంపేట పెద్దలతో కలిసి సమస్యకు పరిష్కారం తీసుకుంటామని వివరించారు. అందుకు అనుగుణంగానే రెండు రోజుల కిందట పాపంపేట పెద్దలతో ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆయన సమావేశం నిర్వహించారు. సమస్య పరిష్కారానికి ఏం చేయాలన్న దానిపై సుదీర్ఘంగా చర్చించారు. ఎవరూ ఆందోళన చెందకండని, మీ ఇళ్లకు, మీస్థలాలకు మాది బాధ్యత అని హామీ ఇచ్చారు. నివాస గృహాలతో పాటు మీరు కొన్న ఖాళీ స్థలాలు మీకే చెందేలా శాశ్వత పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. అందుకు అనుగుణంగానే అడుగులు పడ్డాయి. శుక్రవారం రాచూరి కుటుంబ సభ్యులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి పాపంపేటలోని ఇళ్లకు, కొనుగోలు చేసి స్థలాలకు హక్కు విడుదలకు సిద్ధమని ప్రకటించారు.

హక్కు విడుదలకు సిద్ధం: రాచూరి కుటుంబ సభ్యులు

మండలంలోని పాపంపేటలో ఇళ్లు నిర్మించుకున్న వారికి, ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన వారికి హక్కు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రాచూరి వెంకటరమణ, వెంకట కిరణ్ తెలిపారు. రుద్రంపేట సమీపంలోని ఓ హోటల్లో శుక్రవారం వారు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత వారంరోజుల కిందట మీడియా ద్వారా తమ అభిప్రాయాన్ని వెల్లడించామన్నారు. తమపై వస్తున్న నిందారోపణలు బాధించాయన్నారు. మాదికాని సొమ్ముకోసం ఆశించే దుస్థితిలో తాము లేమన్నారు. భూమిపై హక్కు ఉందన్న ఉద్దేశ్యంతోనే న్యాయపరంగా పోరాటం చేస్తున్నామన్నారు. సామాన్యుల కష్టాలు మాకు తెలుసన్నారు. ఈక్రమంలోనే తమ కుటుంబ సభ్యులు, పాపంపేట పెద్దల విజ్ఞప్తి మేరకు హక్కు విడుదల నిర్ణయం తీసుకున్నామన్నారు. కొద్దిరోజులుగా తమపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దన్నారు. హక్కు విడుదల ఎప్పటి నుంచి అనేది ఇరుపక్షాల సమయాన్ని బట్టి నిర్ణయం ఉంటుందని చెప్పారు. ఇక నుంచి పాపంపేటలో ఎవరూ ఎలాంటి ఆందోళనకు తావివ్వొద్దండని వారు కోరారు.

కృత్రిమ పరికరాల పంపిణీ



కృత్రిమ పరికరాలు అందజేస్తున్న చైర్మన్ గడిపూటి నారాయణస్వామి

అనంతపురం విద్య, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అవసరమైన వివిధ రకాల కృత్రిమ అవయవాల పరికరాలను విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ గడిపూటి నారాయణస్వామి పంపిణీ చేశారు. నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రి ఆవరణలో శుక్రవారం ఆయన కృత్రిమ పరికరాల తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం అక్కడే పలువురు దివ్యాంగులకు కృత్రిమకాళ్లు, క్యాలిపర్లను పంపిణీ చేశారు. దివ్యాంగుల కార్పొరేషన్ ఏడీ అర్చన, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆలం నరసానాయుడు

నార్పల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రాజన్న గత గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దాడి ఘటనలో నలుగురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ జగదీష్

అనంతపురం క్రైం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కారులో ఓ వ్యక్తిని బలవంతంగా ఎత్తుకెళ్లి దాడి చేసిన ఘటనలో నలుగురిని అరెస్టు చేసినట్టు సీఐ జగదీష్ తెలిపారు. స్థానిక నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 29వ తేదీన సాయంత్రం రామ్‌నగర్‌కు చెందిన శంకర్ అనే వ్యక్తిని ఏడీసీసీ బ్యాంకు కాలనీ వద్ద జనార్ధన్‌రెడ్డి, మరో ముగ్గురితో కలిసి కారులో ఎత్తుకెళ్లారు. వడియంపేట పొలాల్లోకి తీసుకెళ్లి ఇనుప రాడ్లు, డ్రిప్ వైరు, కట్టెలతో అతి దారుణంగా కొట్టారు. మూడేళ్ల కిందట భర్త చనిపోయిన మహిళను శంకర్ ఈ నెల 29న చెరువు కట్టపై వివాహం చేసుకున్నాడు. ఇది తెలుసుకున్న జనార్ధన్‌రెడ్డి జీర్ణించుకోలేక తన స్నేహితులు శరత్‌బాబు, మహమ్మద్, హనుమంతరెడ్డితో కలిసి శంకర్‌ను కారు ఎత్తుకెళ్లి తీవ్రంగా దాడిచేశారు. దాడి చేసిన నలుగురినీ అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. అలాగే వారు ఉపయోగించిన కారు, ఇనుప రాడ్లు, డ్రిప్ వైరు, కట్టెను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పేర్కొన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

● నివాళులర్పించిన జేఎన్‌టీయూ, ఎస్కేయూ వీసీలు

అనంతపురం రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జేఎన్‌టీయూలోని ఏపీజే అబ్దుల్ కలాం పరిపాలన భవనంతో పాటు తైల సాంకేతిక, ఔషధ పరిశోధనా సంస్థ, ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వర్సిటీ వైస్ చాన్సలర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణయ్య, ఓఎస్‌డీ టూ వీసీ దేవన్న తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ దేశ సమైక్యత కోసం సర్దార్ పటేల్ చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. అలాగే ఓటీపీఆర్ఐలో డైరెక్టర్ సుబ్బారెడ్డి తదితరులు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్లు భానుమూర్తి, సత్యనారాయణ, దుర్గాప్రసాద్, నాగప్రసాద్ నాయుడు, ఈశ్వర్‌రెడ్డి, వైశాలి ఫెర్నాండే, శోభా బిందు, కిరణ్మయి, సుజాత, దేవకుమార్, శివకుమార్, ఓంప్రకాష్, ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, ఫైనాన్స్ ఆఫీసర్ వెంకట శివారెడ్డి, ఫార్మసీ ప్రిన్సిపాల్ గోపీనాథ్, ఓటీపీఆర్ఐ ఎన్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లహరి పాల్గొన్నారు.

ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో..

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, రెక్టార్ వెంకటనాయుడు తదితరులు వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, అసిస్టెంట్ రిజిస్ట్రార్ తిమ్మప్ప, ఐక్యూఏసీ డైరెక్టర్ వెంకటరమణ, పరీక్షల విభాగం సంచాలకులు రమణ, ఫార్మసీ ప్రిన్సిపాల్ సోమశేఖర్, కన్వీనర్ పల్లవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జేఎన్‌టీయూలో వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ సుదర్శన్‌రావు తదితరులు



ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో నివాళులర్పిస్తున్న వీసీ అనిత తదితరులు

తాగునీటి సమస్య పరిష్కరించండి

పుట్లూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీకాలనీకి తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజీ అవుతోందని, దీంతో సుమారు 20 రోజులుగా తాము తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీ వాసులు శుక్రవారం వాపోయారు. దీనిపై పలుమార్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తమకు ఏఈ అందుబాటులో ఉండటం లేదని , తాము ఫోన్ చేస్తే కనీసం లిఫ్ట్ కూడా చేయరని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఎట్టకేలకు ఆయన ఫోన్ లిఫ్ట్ చేశారని, సమస్యను చెప్పగా ఆయన తమపై ఆగ్రహం వ్యక్తంచేశారని అన్నారు. తమ సమస్యను పరిష్కరించేలా ఉన్నతాధికారులైనా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై వివరణ కోసం ఏఈ ప్రవీణ్‌కుమార్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా.. ఆయన లిఫ్ట్ చేయలేదు.

స్టోర్ డీలర్ల సంఘం ఎన్నిక ఏకగ్రీవం



అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

కుందుర్పి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్‌టీటీ రాజశేఖర్ అధ్యక్షతన స్టోర్ డీలర్ల సంఘానికి శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా గిడ్డప్ప, ఉపాధ్యక్షుడిగా మర్రిస్వామి, కార్యదర్శిగా సోమనాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిని తహసీల్దార్ ఓబులేష్, రెవెన్యూ సిబ్బంది, స్టోర్ డీలర్లు అభినందించారు.

ఎన్‌సీసీ ఎంపికకు పోటీలు



ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులు

గుంతకల్లుటౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ ఎంపికకు శుక్రవారం పోటీలు నిర్వహించారు. సుబేదార్లు కైలాస్ బంకర్, రాజేష్‌సింగ్, అనంతపురం ఆరో ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రన్నింగ్, పుష్‌అప్స్, పుల్లప్స్ పోటీలు నిర్వహించారు. సీనియర్ డివిజన్ విభాగంలో 13, సీనియర్ వింగ్‌లో తొమ్మిది మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరు ఎన్‌సీసీలో మూడు సంవత్సరాలు శిక్షణ తీసుకొని బీ, సి సర్టిఫికెట్ ఎగ్జామ్ రాసే అర్హత పొందుతారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ బాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయ ప్రారంభోత్సవం



పూజలో పాల్గొన్న ఎంపీ

గుంతకల్లుటౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక హంపయ్యకాలనీలో ఆంజనేయస్వామి ఆలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఉదయం ఆలయంలో విగ్రహ, కలశ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, గుంతకల్లు ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, డాక్టర్ సెల్ అధ్యక్షురాలు పత్తిహిమబిందు, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బంటనహాల్ శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధికారులపై గ్రామస్థుల కినుక

గుంతకల్లు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థాన కలశ స్థాపన కార్యక్రమానికి తమను రానివ్వలేదని కసాపురం గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. కలశ స్థాపన కోసం ఆలయ గోపుర శిఖరాలకు వెళ్లడానికి చెక్కమెట్లను ఏర్పాటు చేశారు. భద్రత దృష్ట్యా దానిపైకి 15 మందికి మించి అనుమతి లేదు. దీంతో ఎమ్మెల్యే జయరాంతో పాటు తూర్పు గోపురం ఎక్కడానికి గ్రామస్థులను పోలీసులు అనుమతించలేదు. దీనిపై ఆ గ్రామస్థులు నిరసన వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న ఈఓ విజయరాజు గ్రామస్థులకు నచ్చజెప్పి, ఒక్కోసారి ఐదుగురు చొప్పున వెళ్లేలా స్థానికులకు అవకాశం కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

తాడిపత్రి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి పట్టణంతో పాటు యాడికి మండలాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను బంద్ చేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిపత్రి మండలంలోని తేరన్నపల్లి గ్రామంలోని 220కెవి సబ్‌స్టేషన్‌లో కొత్తగా బ్రేకర్ ఏర్పాటు చేస్తుండటంతో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రూ.40 లక్షల నిధుల మంజూరు

రాయదుర్గం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతులు, నిర్వహణ కోసం రూ. 40 లక్షలు నిధులు మంజూరైనట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు ప్రతిపాదన మేరకు జిల్లా మైనింగ్ ఫండ్ కింద ఇవి మంజూరైనట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణం అడ్డగింత

తాడిపత్రి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేద్కర్ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఓ ప్రార్థన మందిరాన్ని నిర్మిస్తున్నారంటూ ఆ కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, తహసీల్దార్ సోమశేఖర్‌కు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. దీంతో వారు వెంటనే స్పందించి.. సిబ్బందిని అక్కడికి పంపి ఆ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రంగనాథ, రాంనాథ్, పెద్దక్క, సుభద్ర, గణేష్, రామాంజనేయులు, గంగాధర్, నారాయణస్వామి ఉన్నారు.

గొర్రెల సంత పునఃప్రారంభం

కళ్యాణదుర్గం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులో దాదాపు పది సంవత్సరాల అనంతరం తిరిగి గొర్రెల సంతను శుక్రవారం పునః ప్రారంభించారు. గొర్రెలు, మేకలు, పశువుల కొనుగోలు, అమ్మకాలకు రైతులు, కాపరులు ఈ యార్డ్‌ను వినియోగించుకోవాలని మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ కోనంకి రాజశేఖర్ తెలిపారు. అందుకు గాను ఎవరూ... ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, మార్కెట్ యార్డు డైరెక్టర్లు, టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



గొర్రెల సంతను ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

రేషన్ షాపుల్లో బహిరంగ దోపిడీ

- డబ్బా సహా బియ్యం తూకం
- ప్రశ్నిస్తే దబాయిస్తున్న డీలర్లు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, తూనికలు కొలతల శాఖల అధికారులు

గుంతకల్లుటౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా కొందరు డీలర్లు బహిరంగ దోపిడీకి పాల్పడుతున్నారు. గుంతకల్లు పట్టణంలో 70, మండలంలో 39 రేషన్ షాపులు ఉన్నాయి, దాదాపు 42 వేల కార్డులు ఉన్నాయి. పలు రేషన్ దుకాణాల్లో బియ్యంతో పాటు సుమారు ఒకటిన్నర కిలోల బరువున్న డబ్బాను ఉంచి.. తూకం వేసి లబ్ధిదారులకు వేస్తున్నారు. 20 కేజీల బియ్యాన్ని ఒక సారి ఇలా తూకం వేసి ఇస్తారు. కార్డులకు 35 కేజీల బియ్యం ఇవ్వాల్సి వస్తే.. రెండు సార్లు తూకం వేసి ఇస్తారు. అంటే అప్పుడు మొత్తం మూడు కేజీల బియ్యాన్ని తక్కువగా ఇస్తారు. దీనిపై లబ్ధిదారులు ప్రశ్నిస్తే.. స్టాక్ పాయింట్‌లో వంద కేజీల ప్యాకెట్‌కు తూకం తక్కువ వస్తుందని, ప్రతి నెలా అధికారులకు మామూళ్లు ఇస్తున్నామని.. డీలర్లు దబాయిస్తున్నారు. ఇలా డీలర్లు ప్రతి కార్డు మీద బియ్యాన్ని దోపిడీ చేస్తూ... ప్రతి నెలా రూ. లక్షలు దండుకుంటున్నారు. ఇలా వీరు బహిరంగ దోపిడీకి పాల్పడుతున్నా.. రెవెన్యూ, తూనికల శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారే తప్పా.. ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై ఫిర్యాదు చేస్తేనే తాము స్పందిస్తామని వారు తెగేసి చెబుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌కు వివరణ కోరేందుకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు.



తూకానికి బియ్యంతో పాటు ఉంచిన డబ్బా

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

తూకాల్లో మోసం చేస్తున్న వారిపై ఫిర్యాదు చేస్తే.. తనిఖీలు చేస్తాం. నేరం రుజువైతే చర్యలు తీసుకుంటాం. మోసాలకు పాల్పడే వారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదు. తుకాల్లో తేడా వచ్చినా వెంటనే ఆ డీలర్‌ను లబ్ధిదారులు నిలదీయాలి. ఇంటికి వెళ్లి వచ్చిన తరువాత ప్రశ్నిస్తే ఫలితం ఉండదు.

- శంకర్, తూనికల కొలతల ఇన్‌స్పెక్టర్

తనిఖీలు చేస్తాం

రేషన్ దుకాణాలను శనివారం నుంచి తనిఖీ చేస్తాం. తనిఖీల్లో మోసాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటాం. తూకాల్లో తేడా వస్తే డీలర్‌ను లబ్ధిదారులు నిలదీయాలి.

- సుబ్బలక్ష్మి, సీఎస్‌డీటీ గుంతకల్లు



ప్రజాసమస్యలపై నిర్లక్ష్యం వల్లే పదవి ఊడింది

మున్సిపల్ మాజీ చైర్మన్‌పై టీడీపీ నాయకుల ఫైర్

కళ్యాణదుర్గం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్మన్‌గా ఉండి కూడా తలారి రాజ్‌కుమార్ ప్రజాసమస్యలను నిర్లక్ష్యం చేశారని, దా ని ఫలితంగానే పదవి పోయిందని, ఇందులో రాజకీయాలు ఏమీ లేవ ని.. టీడీపీ పట్టణ అధ్యక్షుడు సర్మస్ వలీ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. '14 నెలలుగా ప్రజాసమస్యలను గాలికి వదిలేశారు. ఏ రోజూ మున్సిపల్ కార్యాలయానికి రాలేదు. పలుమార్లు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది కౌన్సిల్ సమావేశం నిర్వహించడానికి రిజిస్టర్ పోస్టులు పంపించినా వాటికి స్పందించకుండా మొద్దు నిద్రలో ఉండిపోయారు. పట్టణంలో ప్రజలు తాగునీరు, డ్రైనేజీ తదితర అనేక సమస్యతో ఇబ్బందులు పడుతున్నా.. ఏ మాత్రం పట్టించుకోలేదు. సమస్యల పరిష్కారం కోసం కౌన్సిల్ సమావేశం నిర్వహించడానికి కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ ఆహ్వానించినా ఒక్కసారి కూడా కౌన్సిల్ సమావేశానికి రాకుండా.. అభివృద్ధిని అడ్డుకున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించే ఎమ్మెల్యే దొరకడం అదృష్టం. కాని మీరు ఆ అభివృద్ధిని అడ్డుకునేలా ప్రవర్తించారు. మీరు చేసిన నిర్లక్ష్యం.. చేసిన తప్పిదాల వల్లే మీ పదవి పోయిందే తప్పా..ఇందులో రాజకీయాలు ఏమీ లేవు.' అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు సర్మస్‌వలీ

త్వరలో పప్పుశనగ విత్తనాల పంపిణీ

పుట్లూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రబీలో సాగుచేసే పప్పుశనగ విత్తనాలు 250 క్వింటాళ్లు మండలానికి చేరినట్లు మండల వ్యవసాయ అధికారి కాత్యాయిని శుక్రవారం తెలిపారు. విత్తనాల కోసం రైతుసేవా కేంద్రాల్లో ఇప్పటివరకు 187మంది రైతులు పేర్లను నమోదు చేసుకున్నారని, త్వరలోనే పంపిణీ చేస్తామని తెలిపారు.

మాడుగుల నాగఫణిశర్మకు సన్మానం



శర్మను సన్మానిస్తున్న గంగాధర్

తాడిపత్రి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమ్మవారిశాల వీధిలో తన తమ్ముడు మాడుగుల విశ్వంశర్మ ఇంటికి మాడుగుల నాగఫణిశర్మ శుక్రవారం హైదరాబాద్ నుంచి వచ్చారు. శ్రీవాణి విద్యాసంస్థల అధినేత గంగాధర్, కార్తీక్, నీలకంఠ కుటుంబ సభ్యులతో వెళ్లి ఆయనను కలిశారు. అనంతరం శర్మను సన్మానించారు.

జిల్లా జట్టుకు ఎంపిక



బురనుద్దీన్

తాడిపత్రి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే రాయలసీమ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో జిల్లా తరఫున అండర్ - 14 విభాగంలో తాడిపత్రికి చెందిన క్రీడాకారుడు బురనుద్దిన్ ఎంపికైనట్లు క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సాధిక్‌వలి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురంలో శుక్రవారం జరిగిన అండర్-14 ప్రాబబుల్స్‌లో బురనుద్దిన్ మంచి ప్రతిభ చూపడంతో జట్టుకు ఎంపికయ్యాడని తెలిపారు.

సమాచారం లేకుండా విచారణ

బొమ్మనహాళ్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల సమస్యలను తెలుసుకోవాలని హౌసింగ్ జిల్లా అధికారి శైలజ మండలంలోని నేమకల్లు గ్రామంలో శుక్రవారం పర్యటించారు. అయితే దరఖాస్తుదారులకు ఈ సమాచారం అందకపోవడంతో వారు ఉదయమే పనులకు వెళ్లిపోయారు. దీంతో అధికారులు ఉన్న కొందరిని సచివాలయానికి పిలిపించి విచారణ చేశారు. అధికారులు వచ్చామా.. వెళ్లామా.. అన్నట్లు పని కానిచ్చేశారు. ఇందులో స్థానిక హౌసింగ్ ఏఈఈ వాసంతి, తహసీల్దార్ మునివేలు, హౌసింగ్ డీఈఈ రామ్మూర్తి తదితరలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరు చోరీ

బెళుగుప్ప, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులెన్నకు చెందిన రైతులు విశ్వనాథ్, రామాంజినేయులు, నారాయణస్వామి తోటలకు అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరు గురువారం రాత్రి చోరీకి గురైంది. దీనిపై బాధిత రైతులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో రూ. 30 వేలు విలువైన 25 కిలోల రాగి వైర్ చోరీ అయిందని ట్రాన్స్‌కో ఏఈ గంగాధర తెలిపారు.

జూదరుల అరెస్ట్

పెద్దపప్పూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అమ్మలదిన్నె, నరసాపురం గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులు మండలకేంద్రానికి సమీపంలో పేకాట ఆడుతుండగా శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. రూ.10,150 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

ఉరవకొండ,అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ నాయకులు ఉరవకొండలో మంత్రి పయ్యావుల కేశవ్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఓబన్న, వేణుగోపాల్, భువనేశ్వర చౌదరి, లోకేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కాజ్‌వేకు మరమ్మతులు



కాజ్‌వేను బాగుచేస్తున్న గ్రామస్థులు

గుమ్మఘట్ట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): వేదవతి హగరిపై వేపలపర్తి - రాయదుర్గం మధ్య ఉన్న కాజ్‌వేకు పలు గ్రామాల ప్రజలు శుక్రవారం మరమ్మతులు చేసి.. బాగు చేసుకున్నారు. ఇటీవల బీటీపీ గేట్లు ఎత్తడంతో వరదనీటి ప్రవాహానికి ఈ కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోయింది. బ్రహ్మసముద్రం మండల పరిధిలోని 10 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడేవారు. వరద తగ్గడంతో కాజ్‌వేకు వేపలపర్తి, గోవిందయ్యదొడ్డి, గుండిగానిపల్లి తదితర గ్రామస్థులు చొరవ తీసుకొని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు సహకారంతో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి ఆ దారిని బాగు చేసుకున్నారు.



